మంగళవారం ఉష్ణోగ్రతలు ఇలా..	రాజీవ్ నగర్	హఫీజ్‌పేట	యాకుత్‌పురా	కేపీహెచ్‌బీ	బన్సీలాల్‌పేట	ఎల్‌బీనగర్	శివరాంపల్లి	చిలకలగూడ	కిషన్‌బాగ్	బండ్లగూడ	నాంపల్లి	కూకట్‌పల్లి
	43.5	43.3	43.2	43.1	43.0	43.0	42.9	42.9	42.8	42.7	42.5	42.4

కాంగ్రెస్‌కు మాదిగ సంఘాల మహా కూటమి మద్దతు



మాట్లాడుతున్న పోకల కిరణ్ మాదిగ

పంజగుట్ట: మాదిగ జాతికి మంద కృష్ణ మాదిగ, మోత్కుపల్లి నర్సింహులు తీరని అన్యాయం చేస్తున్నారని తెలంగాణ మాదిగ సంఘాల మహా కూటమి చైర్మన్ పోకల కిరణ్ కుమార్ మాదిగ అన్నారు. జాతిని అడ్డం పెట్టుకుని మంద కృష్ణ ప్యాకేజీలు పొందాడని, మోత్కుపల్లి పదవులు అనుభవించాడని ఆరోపించారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రధాన కార్యదర్శి దశపాక నర్సింహ మాదిగ, వైస్ చైర్మన్ శ్రీనివాస్‌లతో కలిసి మాట్లాడుతూ... గత 30 ఏళ్లుగా మాదిగ రిజర్వేషన్ల పేరుతో మంద కృష్ణ మాదిగలను వంచిస్తున్నాడని ఆరోపించారు. వీరిద్దరూ మాదిగ జాతికి ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. వారి లబ్ధి కోసం మాదిగజాతిని గంపగుత్తలా పార్టీలకు అమ్మేస్తున్నారన్నారు. మహా కూటమి కాంగ్రెస్ పార్టీకి మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ప్రతి దళితవాడలో పర్యటించి మాదిగలను చైతన్యం చేస్తామని, మాదిగ బిడ్డ అయిన రాజయ్యను అకారణంగా పదవినుంచి తొలగించిన బీఆర్ఎస్‌కు, అధికారంలోకి రాగానే 100 రోజుల్లో వర్గీకరణ చేస్తానని మాట తప్పిన బీజేపీకి ఓటువెయ్యారాదన్నారు. వర్గీకరణ కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో మాస్టార్‌జీ, మల్లు శివరాం, పుంజర్ల సుధాకర్ మాదిగ, తలారి చైతన్య, యాదగిరి, ప్రేమ్ రాజ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

మలక్‌పేట: ఎన్నికల విధినిర్వహణలో అధికారులు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. మంగళవారం హైద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని మలక్‌పేట అసెంబ్లీ నియోజకవర్గం ముంతాజ్ కాలేజ్‌లో ప్రొసీడింగ్, అసిస్టెంట్ ప్రొసిడింగ్ ఆఫీసర్లకు నిర్వహిస్తున్న శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు ఎన్నికల నియమావళి పాటించాలని, ఈవీఎంల ఆపరేటింగ్, వాటిని భద్రపరిచే విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అవకతవకలకు తావులేకుండా పోలింగ్ సజావుగా నిర్వహించాలని సూచించారు. 360 పీఓ, ఏపీఓలకు గాను 319 మంది శిక్షణకు హాజరు కాగా 41 గైర్హాజరయ్యారు. కార్యక్రమంలో ఏఆర్ఓ రాజేష్‌కుమార్, ఏఆర్ఓ, సైదాబాద్ తహశీల్దార్ జయశ్రీ, ట్రైనింగ్ నోడల్ ఆఫీసర్, డీపీఓ యుగంధర్‌రెడ్డి, సెక్టోరల్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.

వంట సరిగా చేయలేదని..



రవీనా దుర్వే మృతదేహం



నిందితుడు నవీన్ దుర్వే

భార్యను చంపిన భర్త

నిజాంపేట్: వంట రుచిగా చేయలేదని ఓ వ్యక్తి భార్యతో గొడవపడి ఆమెను హతమార్చిన సంఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది.. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన నవీన్ దుర్వే, రవీనా దుర్వే(28) నగరానికి వలస వచ్చి బాచుపల్లిలోని వెనుక ఉన్న ప్రగతి కన్‌స్ట్రక్షన్స్‌లో కార్మికులుగా పనిచేస్తూ గుడిసెల్లో నివాసం ఉంటున్నారు. వీరికి ముగ్గురు సంతానం. సోమవారం రాత్రి వంట విషయమై భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. వంట సరిగా చేయడం లేదని ఆగ్రహానికి లోనైన నవీన్ ఇటుకతో భార్య రవీనా తలపై మోదడంతో తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. సమాచారం అందుకున్న బాచుపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. నిందితుడు నవీన్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బ్రిలియంట్ గ్రామర్ స్కూల్ విద్యార్థుల సత్తా



సాక్షి,సిటీబ్యూరో: పదవ తరగతి పరీక్షల్లో బ్రిలియంట్ గ్రామర్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. మొత్తం 1690 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా , 123 మంది విద్యార్థులు పదికి పది జీపీఏ, 586 మంది ఏ గ్రేడ్, 512 మంది ఏ–2 గ్రేడ్, మిగిలిన విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు విద్యా సంస్థల చైర్మన్ కొశిరెడ్డి నారాయణ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆయన అభినందించారు.

ఇరాన్‌కు డ్రగ్స్ కొరియర్ చేస్తున్నారంటూ..

- ముంబై క్రైమ్ బ్రాంచ్ పోలీసుల పేరుతో స్కైప్ కాల్
- రూ. 47 లక్షలు వసూలు

హిమాయత్‌నగర్: ముంబై నుంచి ఇరాన్ దేశానికి డ్రగ్స్ కొరియర్ చేస్తున్నారని బెదిరించి సైబర్ నేరగాళ్లు ఓ వ్యక్తికి టోకరా వేశారు. నగర సైబర్ క్రైమ్ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నగరానికి చెందిన వ్యక్తికి ముంబై ఫెడెక్స్ కొరియర్ పేరుతో ఫోన్ చేసిన గుర్తు తెలియని వ్యక్తులు అతడి ఆధార్ కార్డ్‌తో ముంబై నుంచి ఇరాన్‌కు 450 గ్రాముల ఎండీఎంఏ, 5 కిలోల దుస్తులు, 3 ఎక్స్‌పైరీ అయిన పాస్‌పోర్ట్‌లు, ల్యాప్‌టాప్‌తో కూడిన పార్సిల్‌ను ముంబై కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం అతడికి క్రైమ్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ పేరుతో స్కైప్ వీడియో కాల్ చేసిన సైబర్ నేరగాళ్లు బాధితుడికి చెందిన ఆరు నెలల బ్యాంక్ స్టేట్‌మెంట్‌లు, పాన్ కార్డ్, ఆధార్ కార్డ్, ఉద్యోగ వివరాలు అడిగారు. ఈ విషయాలను తమ కుటుంబ సభ్యులతో కూడా చెప్పవద్దని బెదిరించారు. డ్రగ్స్ కొరియర్‌తో పాటు మనీలాండరింగ్ కేసులు ఉన్నాయని అతడిని బెదిరించారు. గత ఆరు నెలల బ్యాంక్ లావాదేవీలతో పాటు నిబంధనల ప్రకారం బ్యాంక్‌లలో ఉన్న నగదును పంపించాలని, వెరిఫై చేసి తిరిగి పంపిస్తామని నమ్మించారు. స్కైప్ కాల్‌లో ఉండగానే ఇతర విషయాల కోసం సమీపంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్రాంచ్‌కు వెళ్లి బయట వేచి ఉండాలని సూచించారు. వారి నమ్మిన బాధితుడు కేటుగాళ్లు చెప్పిన విధంగా రూ.46,78,000 బదిలీ చేశాడు. అనంతరం డబ్బు తిరిగి రాకపోవడం, వారు స్పందించకపోవడంతో తాను మోసపోయినట్లు గుర్తించి నగర సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ శివమారుతి తెలిపారు.

ఉన్నంతలో చదువుకుని... ఉన్నతమైన మార్కులు సాధించి..

ఆదర్శంగా నిలుస్తున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు



ఎం.అక్షర	సైసాయి మౌనిక	జె.భవాని	రంగ రక్షిత	పి. భవ్యశ్రీ	హజారా బేగం	నాగేశ్వరి	సంజన
(10/10)	(9.7 జీపీఏ)	(9.8 జీపీఏ)	(9.8 జీపీఏ)	(9.5 జీపీఏ)	(9.7 జీపీఏ)	(9.5 జీపీఏ)	(9.7 జీపీఏ)

పదో తరగతి ఫలితాల్లో కుత్బుల్లాపూర్ జోన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తాచాటారు. సర్కారు బడిలో చదివే విద్యార్థులు ఎవరినీ తీసిపోరని నిరూపించారు. కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదివితేనే మంచి మార్కులు వస్తాయనే భావనను పటాపంచలు చేశారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఉత్తమ ఫలితాలు సాధించారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రుల ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. ఉన్నంతలో చదువుకుని ఉన్నతమైన మార్కులు సాధించారని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల నుంచి విద్యార్థులకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

– దుండిగల్

ఉత్తీర్ణతలో భగత్‌సింగ్‌నగర్ ఫస్ట్



వర్ష (9.5 జీపీఏ)



రాధాకుమారి (9.5 జీపీఏ)

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని దుండిగల్, బాచుపల్లి, కుత్బుల్లాపూర్ మండలాల్లో మొత్తం 21 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఇందులో మొత్తం 2091 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 1529 మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తంగా 73 ఉత్తీర్ణత శాతం సాధించారు. భగత్‌సింగ్‌నగర్ పాఠశాల 88 శాతం సాధించి మొదటి స్థానంలో నిలిచింది. రెండో స్థానంలో గాగిల్లాపూర్(86.36) మూడో స్థానంలో బహదూర్‌పల్లి(85.07) నిలవగా, చివరి స్థానంలో షాపూర్‌నగర్(54 శాతం) నిలిచింది.

పాఠశాల పేరు	విద్యార్థులు	ఉత్తీర్ణులైన వారు	ఉత్తీర్ణత శాతం
నిజాంపేట్	150	113	75.33
బాచుపల్లి	108	69	63.89
ప్రగతినగర్	81	54	66.67
గాగిల్లాపూర్	44	38	86.36
బహదూర్‌పల్లి	67	57	85.07
కొంపల్లి	78	56	71.79
బౌరంపేట్	81	66	81.48
మల్లంపేట్	113	88	77.88
దూలపల్లి	71	57	80.28
దుండిగల్	144	118	81.94
నెహ్రూనగర్	101	69	68.32
సూరారం గ్రామం	83	49	59.04
కుత్బుల్లాపూర్	161	115	71.43
సూరారం కాలనీ	168	124	73.81
జీడిమెట్ల	116	93	80.17
గాంధీనగర్	82	60	73.17
జగద్గిరిగుట్ట	199	137	68.84
షాపూర్‌నగర్	103	56	54.37
గాజులరామారం	81	60	74.07
భగత్‌సింగ్‌నగర్	25	22	88
గురుమూర్తినగర్	35	28	80
మొత్తం	2091	1529	73

తగ్గిన ఉత్తీర్ణత శాతం

గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది 4 శాతం ఉత్తీర్ణత తగ్గింది. 2015–16లో 60, 2016–17లో 65, 2017–18లో 72.14, 2018–19లో 81.14 ఉత్తీర్ణత శాతం నమోదైంది. 2019–20, 2020–21 కరోనా కారణంగా పరీక్షలు నిర్వహించలేదు. 21–22లో 62.05, 22–23లో 77, 23–24లో 73 శాతం సాధించింది.

10/10 సాధించింది ఒకే విద్యార్థిని

ప్రగతినగర్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ఎం.అక్షర ఒక్కరే 10/10 జీపీఏ సాధించగా 63 మంది విద్యార్థులకు 9 జీపీఏకు పైగా సాధించారు. ఎప్పటిలాగా ఈ ఏడాది కూడా బాలికలు తమ హవా కొనసాగించారు.

ఘనంగా 34వ అటవీ బీట్ అధికారుల స్నాతకోత్సవం



శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ప్రశంస పత్రాలుఅందజేస్తున్న ఎల్యూసింగ్ మేరు

సుబాష్‌నగర్: శిక్షణలో నేర్చుకున్న విషయాలను క్షేత్రస్థాయిలో అమలు పరచాలని... పరిస్థితుల నుంచి కొత్త విషయాలను నేర్చుకుంటూ వృత్తిని సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ముఖ్య అటవీ సంరక్షణ అధికారి ఎల్యూసింగ్ మేరు అన్నారు. మంగళవారం దూలపల్లిలోని తెలంగాణ రాష్ట్ర అటవీ అకాడమీలో 34వ బ్యాచ్ అటవీ బీట్ అధికారుల స్నాతకోత్సవం జరిగింది. ఆరు నెలలు పాటు కొనసాగిన శిక్షణలో 96 మంది బీట్ ఆఫీసర్లుగా బాధ్యతలు చేపట్టారు. బీట్ అధికారుల కోర్స్ డైరెక్టర్, పి.వి.రామకృష్ణ, బీటు అధికారుల శిక్షణా కార్యక్రమం రిపోర్టును సమర్పించారు.

- శిక్షణా కార్యక్రమం అంతిమ పరీక్షలలో 53 మంది బీటు అధికారులు ఆనర్స్ శ్రేణిలో, 31 మంది ఉన్నత శ్రేణిలో, మిగతావారు దిగువ శ్రేణిలో ఉత్తీర్ణులు కాగా వారికి ప్రశంస పత్రాలు అందజేశారు. కామారెడ్డి అటవీ డివిజన్‌కు చెందిన బి.శేఖర్ శిక్షణలో నాలుగు బంగారు పతకాలు, టి.రాకేష్, సి.చంద్రశేఖర్ రెండు పతకాలను, బి.విజయ్ కుమార్, జె.శ్రీవల్లి, ఎం.ప్రదీప్, యు.నాగార్జున్, బి.రవి ఒక్కో బంగారు పతకాన్ని పొందారు. మారథాన్ పరుగు పందెంలో మహిళల విభాగంలో ఎస్.సంతోష, పురుషుల విభాగంలో డి.రమేష్ పతకాలను సాధించారు.
- అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎల్యూసింగ్ మేరు మాట్లాడుతూ.. కాలానికి అనుగుణంగా అటవీ శాఖ పాత్ర మారుతోందన్నారు. అటవీ రక్షణ, అటవీ భూముల రక్షణ నేడు పెను సవాల్‌గా మారిందన్నారు. శిక్షణ అందించిన జ్ఞానం, నైపుణ్యాలు, ఆత్మ విశ్వాసంతో శిక్షణాధికారులు క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరిస్తూ అటవీ, వన్యప్రాణి రక్షణలో పనిచేయాలన్నారు.
- ఈ కార్యక్రమంలో అటవీ అకాడమీ సంచాలకులు ఎస్.జె.ఆశా, విశ్రాంత అటవీ అధికారులు ప్రదీప్, కిషన్, రవీందర్ అటవీ అకాడమీ అదనపు సంచాలకులు ఎస్. రమేష్, సంయుక్త డైరెక్టర్ బి.ప్రవీణ, డిప్యూటీ డైరెక్టర్లు సి.హెచ్. గంగారెడ్డి, వి.ఆంజనేయులు, వి.రామ మోహన్, కె.శ్రీనివాస్, ఎస్.ఎ.నాగినీ బాను, రేంజ్ అధికారులు, ఎం.వంశీ కృష్ణ, వై.సుభాష్ చంద్ర యాదవ్, ఎం.రామ్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రాడిసన్ స్టార్ హోటల్‌లో వజ్రాభరణాలు చోరీ

బంజారాహిల్స్: శుభకార్యానికి తమిళనాడు నుంచి హైదరాబాద్ వచ్చి స్టార్ హోటల్‌లో బస చేసిన మహిళకు చెందిన బంగారు వజ్రాభరణాలు చోరీకి గురైన సంఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... తమిళనాడు మధురైకి చెందిన మెహ్రూన్ ఇస్మాయిల్ అనే మహిళ శుభకార్యం నిమిత్తం హైదరాబాద్ వచ్చి బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–6లోని రాడిసన్ బ్లూప్లాజా హోటల్‌లో రూమ్ నెంబర్ 427లో బస చేసింది. ఈ నెల 27న ఉదయం తన గది నుంచి గ్రౌండ్ ఫ్లోర్‌లో బ్రేక్‌ఫాస్ట్ చేయడానికి వచ్చింది. ఆ సమయంలో హోటల్ సిబ్బంది ఆమెకు తెలియకుండా రూమ్ క్లీనింగ్ చేసి వెళ్లిపోయారు. గదికి వచ్చి చూడగా లాకర్‌లో ఉండాల్సిన గోల్డ్ డైమండ్ ఆభరణాలు కనిపించలేదు. నాలుగో అంతస్తు ఫ్లోర్ ఇన్‌చార్జి, సూపర్‌వైజర్, రూమ్ సర్వీస్ స్టాఫ్‌లపై అనుమానం వ్యక్తం చేస్తూ ఆమె బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వాష్‌రూంలో యువతి ఫొటోలు తీసేందుకు యత్నం

వెంగళరావునగర్: ఓ గుర్తుతెలియని వ్యక్తి వాష్‌రూంలోకి వెళ్లిన యువతి ఫొటోలు, వీడియోలు తీయడానికి యత్నించిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మధురానగర్‌కాలనీ ప్రధాన రహదారిలో హరేలియా హాస్టల్‌లో కొందరు యువతులు, మహిళలు ఉంటున్నారు. ఏప్రిల్ 28న తెల్లవారుజామున ఓ యువతి వాష్‌రూంలోకి వెళ్లగా ఇదే సమయంలో గుర్తు తెలియని వ్యక్తి వెంటిలేటర్ గుండా ఫొటోలు, వీడియోలు తీయడానికి ప్రయత్నించాడు. దీనిని గుర్తించిన ఆమె కేకలు వేయడంతో సదరు వ్యక్తి పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డబ్ల్యూసీఓఏ అధ్యక్షుడిగా రాజానర్సింగ్‌రావు

బంజారాహిల్స్: ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్‌లో సీనియర్ అనస్థీషియాలజిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ రాజా నర్సింగ్‌రావు వరల్డ్ కాంగ్రెస్ ఆఫ్ ఆప్తాల్మిక్ అనస్థీషియా (డబ్ల్యూసీఓఏ) అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. బ్రెజిల్‌లోని సావోపాలోలో జరిగిన డబ్ల్యూసీఓఏ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. 2028లో హైదరాబాద్‌లో వరల్డ్ కాంగ్రెస్ ఆఫ్ ఆప్తాల్మిక్ అనస్థీషియా సమావేశాన్ని నిర్వహించాలని కొత్తగా ఎన్నికైన అధ్యక్షుడు రాజానర్సింగరావు ప్రతిపాదించగా సభ్యులు ఆమోదించారు.

సందడిగా 'రియల్ స్టార్ అవార్డ్స్'...



సాక్షి, సిటీబ్యూరో: గచ్చిబౌలిలోని రాడిసన్ హోటల్ వేదికగా ఏర్పాటు చేసిన 'రియల్ స్టార్ అవార్డ్స్' కార్యక్రమంలో ప్రముఖ సినీతార, బిగ్‌బాస్ ఫేం అశ్విని శ్రీ పాల్గొని సందడి చేశారు. కార్యక్రమంలో ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు డా.గంప నాగేశ్వర్ రావు, రియల్ ఎస్టేట్ కోచ్–ట్రైనర్ సింగిరెడ్డి నిరంజన్ పాల్గొని రియల్ ఎస్టేట్ ఔత్సాహికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు యనమల డెవలపర్స్ సీఎండీ యనమల రాజు మాట్లాడుతూ యనమల డెవలపర్స్ రీ–సేల్‌కు ల్యాండ్ మార్క్‌గా మారిందన్నారు. ఎలాగోలా ప్లాట్లు కొనిపించి చేతులు దులుపుకోకుండా, అవసరమైన సమయంలో వారి ప్లాట్లను అమ్మిపెట్టే బాధ్యత కూడా తామే తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు రజనీ సాయిచంద్, పులిమామిడి నారాయణ, డా.చంద్రకాంత్ రావు, డా.పద్మజలతో పాటు సంస్థ డైరెక్టర్ యనమల సిరి, ఎండీలు సునీల్ ఆర్య, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

9 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

రూ.62,620 నగదు స్వాధీనం



పోలీసుల అదుపులో పేకాట రాయుళ్లు

గచ్చిబౌలి: ఓ అపార్ట్‌మెంట్‌లో గుట్టు చప్పుడు కాకుండా ఆడుతున్న పేకాట రాయుళ్లను రాయదుర్గం పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ సీహెచ్.వెంకన్న కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఖాజాగూడలోని అట్లాంటిక్స్ అపార్ట్‌మెంట్‌లోని ఫ్లాట్ నెంబర్ 304లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో మాదాపూర్ ఎస్‌ఓటీ, రాయదుర్గం పోలీసులు సోమవారం రాత్రి దాడి చేశారు. నిందితుల నుంచి రూ.62,520 నగదు, 11 మొబైల్ ఫోన్లు, ఐదు సెట్ల ప్లేయింగ్ కార్డ్స్ స్వాధీనం చేసుకున్నారు. కమ్మంపాటి మధవి అనే మహిళ కొంత కాలంగా పేకాట కేంద్రాన్ని నిర్వహిస్తూ ఆటకు రూ.వెయ్యి చొప్పున వసూలు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. నిర్వాహకురాలితో పాటు జి.శ్రీనివాస్, కె.రాజేందర్ రెడ్డి, బి.లక్ష్మీనారాయణ, కె.రాములు, కె.బాలరాజ్, ఎం.చలపతి రావు, జి.చంద్ర శేఖర్ రెడ్డి, పి.నాగరాజులకు నోటీసులు జారీ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హోటల్ గదిలో యువకుడి అనుమానాస్పద మృతి



హేమంత్ (ఫైల్)

అమీర్‌పేట: హోటల్ గదిలో ఓ యువకుడు అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన సంఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై శ్రావణ్‌కుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జడ్చర్ల గ్రామానికి చెందిన హేమంత్ (28) బ్రిక్స్ వ్యాపారం చేస్తున్నాడు. అతను కొన్నాళ్లు అదే గ్రామానికి చెందిన యువతిని కొద్ది ప్రేమిస్తున్నాడు. సోమవారం శుభకార్య నిమిత్తం నగరానికి వచ్చిన వారు రాత్రి ఎస్ఆర్‌నగర్‌లోని ఓ హోటల్‌లో బస చేశారు. గదిలో మద్యం సేవించిన హేమంత్ రాత్రి 2 గంటల సమయంలో బాత్‌రూమ్‌లోకి వెళ్లాడు. ఎంతకూ బయటికి రాకపోవడంతో అతడి ప్రియురాలు వెళ్లి చూడగా అపస్మారక స్థితిలో పడి ఉన్న హేమంత్‌ను గుర్తించి అతడి స్నేహితులకు ఫోన్ చేసి సమాచారం అందించింది. సంఘటనా స్థలానికి చేరుకున్న వారు అతడిని బయటికి తీసుకువచ్చి 108 కాల్ చేశారు. పరీక్షించిన సిబ్బంది అతడు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి తల్లి హేమలత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిరుత చిక్కేనా?

శంషాబాద్: మూడ్రోజుల క్రితం ఎయిర్‌పోర్టు రన్‌వే సమీపంలో తిరిగింది చిరుతేనని నిర్ధారణ కావడంతో దానిని పట్టుకునేందుకు అటవీ శాఖ అధికారులు చర్యలు ముమ్మరం చేశారు. బోన్‌ల సంఖ్యను 2 నుంచి 5కు, ట్రాప్ కెమెరాలను 9 నుంచి 20కి పెంచారు. నిర్మానుష్య, అటవీ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బోన్‌లలో మేక మాంసాన్ని పెట్టారు. చిరుత చిక్కేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

రాగిడి లక్ష్మారెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలి



మగ్దూమ్ నగర్‌లో ఎమ్మెల్యే ప్రచారం

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయాలకే ప్రాధాన్యతనిస్తూ స్థానిక అభివృద్ధిని పక్కన పెడుతోందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. మంగళవారం జగద్గిరిగుట్ట డివిజన్ మగ్దూమ్‌నగర్‌లో బీఆర్ఎస్ లోక్‌సభ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు కావస్తున్నా నిధులు కేటాయించకుండా రాజకీయాలు చేస్తోందని ఎద్దేవా చేశారు. తమ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధిని చూసి రాగిడి లక్ష్మారెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జగన్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం చైర్మన్ వేణు యాదవ్, డివిజన్ అధ్యక్షుడు రుద్ర అశోక్, మల్లేష్ గౌడ్, సీనియర్ నాయకులు బండ మహేందర్, శశిధర్ ముదిరాజ్, పాపులుగౌడ్, దినేష్, ఇందిరాగౌడ్, రేణుక యాదవ్, మల్లారెడ్డి, జై హింద్, వెంకట్ రెడ్డి, లక్ష్మణ్, శాంతి, శోభ తదితరులు ఉన్నారు.

'బీసీలకు ఒక్క మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయలేదు'



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ ఐక్యవేదిక నాయకులు

కుత్బుల్లాపూర్: బీసీ రిజర్వేషన్లపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలకు రాష్ట్రానికి విచ్చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షాలు స్పష్టమైన వైఖరికి వెల్లడించాలని బీజీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆరే మహేందర్ అన్నారు. మంగళవారం కొంపల్లిలోని బీసీ ఐక్యవేదిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశ జనాభాలో 60 శాతంలోని బీసీలకు కేంద్రంలో ఒక్క మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయలేదన్నారు. గత పది సంవత్సరాలు అధికారంలో ఉండి బీసీలకు ఒక పథకం కూడా ప్రవేశపెట్టలేదన్నారు.

- కేంద్ర ప్రభుత్వ బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు చేస్తామని హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి సంవత్సరం కేంద్రం ప్రభుత్వం లక్ష కోట్ల బడ్జెట్ బీసీలకు కేటాయించి సబ్‌ప్లాన్ ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్ర బీసీ ఐక్యవేదిక కోఆర్డినేటర్ ఆరే దశరథం, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మేడవరపు రాజేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రంగు క్రాంతి, కుత్బుల్లాపూర్ బీసీ ఐక్య వేదిక నాయకులు అఖిల్, ప్రశాంత్, శ్రీకాంత్ ముదిరాజ్, సాయినాథ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

ఇంటికో ఉద్యోగం ఇవ్వకుండా బీఆర్ఎస్ మోసం చేసింది

మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: నిరుద్యోగభృతి, ఇంటికో ఉద్యోగం ఇవ్వకుండా రాష్ట్ర ప్రజలను గత బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిందని.. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను ప్రశ్నించే హక్కు కేటీఆర్, హరీష్‌రావులకు లేదని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. మంగళవారం సుభాష్‌నగర్‌లో నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డిలతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీశైలంగౌడ్ బీఆర్ఎస్ నాయకుల తీరును ఎండగట్టారు. 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ వేలాది కోట్లు వెదజల్లి రేవంత్‌రెడ్డిని మోసపూరితంగా ఓడించారని, లోక్‌సభ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి ప్రాంత ప్రజలు గుండెల్లో పెట్టుకుని ఆయనకు అఖండ విజయాన్ని ఇచ్చారని గుర్తు చేశారు. ఎంపీగా ఈ ప్రాంతంలో ఎటువంటి అభివృద్ధి పనులు చేయకుండా ఆనాడు బీఆర్ఎస్ ప్రభుత్వం అడ్డు పడిందని ఆరోపించారు. రాష్ట్ర సీఎంగా మల్కాజ్‌గిరి పార్లమెంట్‌కు ప్రత్యేక నిధులు కేటాయిస్తానని ప్రకటించారని, రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తుంటే బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులకు మింగుడు పడటం లేదన్నారు. అందుకే ఆరు గ్యారంటీలపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. తమ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలే సునీత మహేందర్‌రెడ్డిని మల్కాజ్‌గిరి ఎంపీగా గెలిపిస్తాయని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 14 లోక్‌సభ స్థానాలను గెలవడం ఖాయమన్నారు. మే 2, 6, 9వ తేదీల్లో సునీతా మహేందర్‌రెడ్డి చేపట్టనున్న ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని, రోడ్ షోని కాంగ్రెస్ శ్రేణులు సమిష్టిగా జయప్రదం చేయాలని కోరారు. టీపీసీసీ కోఆర్డినేటర్ శోభారాణి, డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ రంగారావు ఉన్నారు.



ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్, హన్మంతరెడ్డి

మేడే పోస్టర్ ఆవిష్కరణ

నిజాంపేట్: చికాగో అమర వీరుల ఆశయ సాధనకు కార్మిక లోకం పోరాడాలని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పాలబిందెల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం నిజాంపేట్ వార్డు కార్యాలయంలో ఏఐటీయూసీ నిజాంపేట్ అధ్యక్షుడు యాదయ్య ఆధ్వర్యంలో మేడే వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ... కార్మిక చట్టాలు కార్మిక హక్కులు హరిస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలు తిప్పికొట్టాలన్నారు. కనీస వేతనాలు పని భద్రత, ఈఎస్ఐ, పీఎఫ్, కార్మికులకు సమగ్ర చట్టాలను అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు దుర్గయ్య, జితయ్యా, కృష్ణ, బ్యాగ్యమ్మ, నర్సమ్మ, అమృత, యాదమ్మ పాల్గొన్నారు.

పేకాడుతున్న నలుగురిపై కేసు

కుత్బుల్లాపూర్: పేకాడుతున్న నలుగురు వ్యక్తులపై పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామరాజునగర్‌లోని సుందరమ్ బ్లాక్‌లోని ఫ్లాట్ నెంబరు 219లో పేకాడుతున్నారని పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. సోమవారం రాత్రి 8.30 గంటల ప్రాంతంలో పోలీసులు సదరు పేకాట అడ్డాపై దాడులు నిర్వహించగా జూదం ఆడుతూ నలుగురు వ్యక్తులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. పేకాడుతున్న మురళీ వర్మ, వెంకటేష్, రామ్మోహన్, శ్రీనివాస్‌లపై కేసు నమోదు చేసిన పోలీసులు వారి వద్ద నుంచి రూ.11.980 నగదు, నాలుగు సెట్ల ప్లేయింగ్ కార్డులు, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.